క్లుప్తంగా

పిఠాపురం ఎంపీడీఓగా చిన్నారావు



ఎంపీడీఓను అభినందిస్తున్న సిబ్బంది

పిఠాపురం: మండల పరిషత్ అధికారిగా బి.చిన్నారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేసి పదోన్నతిపై ఇక్కడకు ఎంపీడీఓగా వచ్చారు. ఆయనకు ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాయాలవుతున్నాయ్.. టైల్స్ మార్చరూ..



ప్రమాదకరంగా ఉన్న పగిలిన టైల్స్

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పగిలిపోయిన టైల్స్ ప్రజలను గాయాల పాలు చేస్తున్నాయి. భవన నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన టైల్స్ వాహనం పడి పగిలిపోయాయి. ఇది జరిగి నెలరోజులు అవుతున్నా వాటిని మార్చాలనే ధ్యాస అధికారులకు కలగకపోవడం శోచనీయం. చెప్పులు లేకుండా నడచివచ్చే వారి కాళ్లకు టైల్స్ అంచులు చీరుకుపోయి గాయాలవుతున్నాయి. కార్యాలయ ఆవరణలోనే అదనంగా కొన్ని టైల్స్ ఉన్నా వాటిని మార్చడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని కౌన్సిలర్లు అంటున్నారు.

విద్యార్థులకు విషయపరిజ్ఞానం అవసరం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న విమలారాణి

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే విషయ పరిజ్ఞానాన్ని కల్గి ఉండాలని సీఐఎస్ఎఫ్ నర్సరీ, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని వానపల్లి విమలారాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతుల్లో గురువారం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సబార్డినేట్ సైనం బుల్లియ్య, తదితరులున్నారు.

శ్మశాన వాటికలో శివుని విగ్రహం ఏర్పాటు



వాకతిప్ప శ్మశానంలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శ్మశాన వాటికలో గురువారం శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచి పాలాని దొరబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, రాపర్తి శ్రీనివాస్, పదం త్రిమూర్తులు, రావు అక్షయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో పెదిరెడ్ల సూర్య భాస్కరరావుకు చెందిన గడ్డివామి గురువారం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. సూర్య భాస్కరరావు తన ఇంటి వద్ద రెండు ఎకరాల పొలంలో గడ్డిని కుప్పగా వేశాడు. ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుని దగ్ధమైంది. స్థానికులు పిఠాపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు.

శ్యామ్‌కుమార్‌కు అభినందనలు

బాలాజీచెరువు: కేంద్ర యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో నోయిడాలో నిర్వహించిన ఖేలో ఇండియా గేమ్స్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించిన జేఎన్‌టీయూకే వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌ను గురువారం తన చాంబర్‌లో వీసీ ప్రసాదరాజు అభినందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించడం సంతోషమని, జేఎన్‌టీయూకే వర్సిటీకి ఈ అవకాశం వచ్చిందన్నారు. మే 25 నుంచి జూన్ 3 వరకూ యూపీలో 22 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించగా, 23 నుంచి 28వ తేదీ వరకూ గ్రేటర్ నోయిడాలో కబడ్డీ పోటీలు నిర్వహించారన్నారు. పోటీలు దిగ్విజయంగా నిర్వహించి కీలకపాత్ర పోషించిన శ్యామ్‌ను డైరెక్టర్లు, టీచింగ్ నాన్‌టీచింగ్ సిబ్బంది అభినందించారు.

అన్నీ గ్యాస్ కబుర్లే..!

- వ్యాపార అవసరాలకు యథేచ్ఛగా గృహ సిలిండర్లు
- ప్రకటనలకే పరిమితమవుతున్న హెచ్చరికలు
- బహిరంగంగా వినియోగిస్తున్నా చర్యలు శూన్యం

సామర్లకోట: గృహ అవసరాలకు వినియోగించాల్సిన వంట గ్యాస్ వాణిజ్య అవసరాలకు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఎన్ని చట్టాలు చేస్తున్నా, ఎంత నిఘా ఉంటున్నా ఎవరిదారి వారిదే అన్నట్టు ఉంటోంది నిబంధనల అమలు తీరు. పట్టించుకోవలసిన రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడంతో ప్రస్తుత 14.2 కేజీల వంట గ్యాస్ సిలెండరు ధర రూ.1,112కు చేరింది. వాణిజ్య సంస్థలో ఉపయోగించే 19 కేజీల గ్యాస్ సిలెండరు ధర ఇటీవల తగ్గడంతో రూ.2,021కి చేరింది. అయినప్పటికీ అది భారంగా ఉండడంతో హొటళ్లు, బ్యాకరీలు, టీస్టాళ్లు, రహదారుల పక్క నిర్వహించే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను బహిరంగంగానే వినియోగిస్తున్నారు.

పది కిలోమీటర్ల లోపైనా తప్పని వసూళ్లు

గ్యాస్ ఏజెన్సీనుంచి 10 కిలోమీటర్లలోపు దూరం ఉన్న వినియోగదారులకు ఎటువంటి వసూళ్లు లేకుండా సిలిండర్ సరఫరా చేయాలి. అటువంటిది లోకల్ పరిధిలోకి వచ్చే కనెక్షన్లకు కూడా రూ.30 నుంచి రూ.50 డెలివరీ చార్జీలు వసూలు చేస్తుండడం గమనార్హం.



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వినియోగిస్తున్న గృహ అవసరాల సిలిండర్

దాడులు నామమాత్రం



గృహ అవసరాల సిలిండర్లను వినియోగించే వ్యాపార సంస్థల్లో రెవెన్యూ అధికారులు తరచుగా దాడులు చేయాలి. ఇటువంటి దుర్వినియోగం వల్ల అసలైన గృహ వినియోగదారులు సిలిండర్ల కొరత ఎదుర్కొనవలసి వస్తుంది. పేదవారికి, ధనవంతులకు వంట గ్యాస్ సిలెండర్ ధర ఒకే విధంగా ఉండటం సరికాదు.

– సంగినీడి భావనారాయణ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్, సామర్లకోట

తరుచూ తనిఖీ చేయాలి



ఇళ్లలో ఉపయోగించే సిలిండర్లను వాణిజ్య సంస్థలో ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటాం. ఎంఎస్ఓ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆర్ఐ, వీఆర్వోలతో కలసి ప్రతి వారం తనిఖీలు చేసేలా ఏర్పాటు చేస్తాం. వంట గ్యాస్ సిలిండర్లు వ్యాపార సంస్థలు ఉపయోగించడం నేరం.

– ఎస్ఎల్‌వీ కుమారి, తహసీల్దార్, సామర్లకోట

అభివృద్ధి పనుల ప్రారంభం

సామర్లకోట: గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహణలో వచ్చిన సమస్యల పరిష్కారానికి మంజూరైన నిధులతో చకచకా ఆయా నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.9.10 లక్షలతో పంట కాలువపై నిర్మించిన వంతెనలను, రూ.2.7 లక్షలతో నిర్మించిన మరో వంతెనను దవులూరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ తిరిగిన సందర్భంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరిస్తున్నామని, అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, గ్రామ సర్పంచ్ సీమల భవాని, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు పేరిరెడ్డి రాయుడు, కో ఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయానికి శంకుస్థాపన

మండల పరిధిలో చంద్రంపాలెం గ్రామంలో టీటీడీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న వేంకటేశ్వర ఆలయానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం శంకుస్థాపన చేశారు. ప్రజల కోరిక మేరకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నిధులు మంజూరు చేశారని, ఈ ఆలయం ప్రారంభోత్సవానికి ఆయనను ఆహ్వానిస్తామని దొరబాబు తెలిపారు.



చంద్రంపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన చేసిన దొరబాబు, ఎమ్మెల్యే తదితరులు

మూడో బ్యాచ్ జెడ్పీటీసీలకు శిక్షణ ప్రారంభం

సామర్లకోట: జెడ్పీటీసీల శిక్షణతో అనేక విషయాలపై అవగాహన పెరుగుతుందని ఈటీసీ ప్రిన్సిపాల్, డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా మూడో బ్యాచ్ శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ జెడ్పీటీసీల విధులు, హక్కులు, బాధ్యతలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈటీసీ ఫ్యాకల్టీలు పి. శ్రీనివాసరావు, శ్రీదేవి, ఎంఎస్ఎన్‌రెడ్డి, నిహారిక, ప్రసాద్ పంచాయతీరాజ్ చట్టం, జెడ్పీ ఏర్పాటు, సభ్యుల ఎంపిక, పదవీ కాలం, రాజీనామా, జిల్లా ప్రజాపరిషత్తు చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల విధులు, అధికారాలు, బాధ్యతలు, స్థాయీ సంఘాల ఏర్పాటు, సమావేశాల నిర్వాహణ, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం, బడ్జెట్ అంశాలపై మొదటి రోజు శిక్షణ ఇచ్చారు.



శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

పిఠాపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు ఎండల తీవ్రత వల్ల దెబ్బతింటున్నాయని, నిర్వాహకులు గుడ్లను చూసి వినియోగించాలని సీడీపీఓ దుర్గాదేవి సూచించారు. నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఆమె గురువారం గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేశారు. రికార్డులను తనిఖీ చేసి, కోడిగుడ్లను పరిశీలించారు. గుడ్ల నాణ్యతపై కాంట్రాక్టర్లను ఆరా తీశారు. ఎండ వేడిమి వల్ల తక్కువ సమయంలో గుడ్లు దెబ్బతింటున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లులకు ఇచ్చే ఆహారంలో ఎటువంటి రాజీ పడకుండా నాణ్యమైన సరకులే ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఎండలకు గుడ్లు తొందరగా పాడవుతున్నాయని, బాగున్న గుడ్లను మాత్రమే చిన్నారులు, గర్భిణులకు సరఫరా చేయాలని సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు నాగమణి, మానసాదేవి తదితరులు ఉన్నారు.



గొల్లప్రోలులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ దుర్గాదేవి

సచివాలయ ఉద్యోగి ఇంట్లో చోరీ

పిఠాపురం: మండలంలోని ఎఫ్‌కే పాలెంలో సచివాలయ ఉద్యోగి ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్‌నబీ తెలిపారు. వివరాల్లోకి వెళితే..పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలేనికి చెందిన వెంపటాపు దుర్గాప్రసాద్ పిఠాపురం పట్టణ వార్డు సచివాలయంలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. స్వగ్రామం ఎఫ్‌కేపాలెంలో నివాసం ఉంటున్న ఆయన బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి తన సోదరుడి ఇంటికి వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం వచ్చే సరికి తన ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.25 వేల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సారా బట్టీలపై దాడులు



పట్టుబడ్డ సారా, బెల్లపు ఊటతో ఎస్ఈబీ అధికారులు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో ఎస్ఈబీ అధికారులు గురువారం దాడులు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఈబీ జేడీ ఆధ్వర్యంలో పెద్దాపురం ఎస్ఈబీ ఇన్‌చార్జి సీఐ స్వామి, సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ వెలుగుల సురేష్ దాడి చేశారు. ఆయా గ్రామాల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకుని 24 లీటర్ల సారా, 120 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వామి తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో అజయ్‌కుమార్ సింగ్, సునీల్‌కుమార్, వెంకటేశ్వరరావు, గిరిధర్, నాగేంద్ర కృష్ణ తదితరులున్నారు.

సేవా సైనికులు వలంటీర్లు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం

పెద్దాపురం: వలంటీర్లు సేవా సైనికులుగా ప్రజలకు సేవలందిస్తున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఆర్‌బీ కొత్తూరు గ్రామంలో గురువారం ఉప సర్పంచ్ గోలి రామారావు అధ్యక్షతన వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దొరబాబు వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వలంటీర్లు పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను చేరవేయాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పార్టీ మండల యూత్ మాజీ అధ్యక్షుడు గోపు మురళితో కలిసి వలంటీర్లను శాలువాలు, పతకాలతో సత్కరించారు. పల్లా శ్రీనివాస్ యాదవ్, యండ్రు సత్తిబాబు, వల్లూరి కుట్టయ్యచౌదరి పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

నేడు వేట్లపాలెం వలంటీర్లకు పురస్కారాలు

సామర్లకోట: వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గ్రామ వలంటీర్లకు శుక్రవారం పురస్కారాలు అందజేయనున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీసభ్యులు, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠలు

- అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు
- ఆలయంలో హోమాల నిర్వహణ

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉమా మార్కెండేయేశ్వర సహిత భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో గురువారం శివలింగం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సంజీవ ఆంజేయ స్వామి, చండీశ్వర విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేద పండితులు దేవులపల్లి ఫణి రామకృష్ణ శర్మ, అళ్లకి వెంకటజోగేశ్వరశర్మ, చేబ్రోలు వెంకట సూర్యసుబ్రహ్మణ్యప్రసాద్, సాయినాగ ప్రసన్న గణపతి మార్కెండేయ శాస్త్రిల ఆధ్వర్యంలో పూజలు, హోమాలు, పూర్ణాహుతి, అభిషేకాలు నిర్వహించారు. వేద స్వస్తి చెప్పి పండితులను ఘనంగా సత్కరించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు గిడుతూరి శ్రీనివాసరావు, బడిగంటి రాంబాబు, నాగేశ్వరరావు, మొండి బాబి తదితరులు భక్తులకు సేవలందించారు.



ఆలయంలో సాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ



అన్నదానంలో పాల్గొన్న భక్తజనం

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం



బాస్కెట్ బాల్ శిక్షణ పొందిన క్రీడాకారులతో ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: క్రీడాకారులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తోందని, గ్రామాల్లో సైతం క్రీడా స్థలాలను అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. స్థానిక రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నెల రోజుల పాటు నిర్వహించిన బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం గురువారం రాత్రి ముగిసింది. ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణలో మంచి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- కొండపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెద్దాపురం : మండలంలోని కొండపల్లి గ్రామంలో గురువారం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కేశారపు అయ్యన్న, పోకనాటి దుర్గారావు, ధనయ్య లతో కలిసి సుమారు మూడున్నర గంటల పాటు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమం అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని దొరబాబు అన్నారు. మహిళాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు దొరబాబు తెలిపారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో లక్కాకుల కృష్ణ, నానాజీ, సుందరెడ్డి రాజు, వైవికే సాయి, ఎస్ఎంసీ చైర్మన్ పోకనాటి శేషారావు, కేదారి శ్రీనివాస్, నాగబోయిన రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



గడపగపడకూ మన ప్రభుత్వంలో ప్రజా సమస్యలు వింటున్న దొరబాబు

ఆటో బోల్తా


ఇద్దరికి గాయాలు



కొండెవరం శివారులో బోల్తా పడిన ఆటో

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో గురువారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే..పిఠాపురం నుంచి ఉప్పాడ వైపు వస్తున్న ఆటో కొండెవరం శివారు ఇటుకుల బట్టీ సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురులో ఇద్దరు మహిళలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణవేణి



పిఠాపురం: పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి గురువారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆమె పిఠాపురం పాదగయ క్షేత్రంలో పురుహూతికా అమ్మవారు, రాజరాజేశ్వరీదేవి, దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి, గండేపల్లి బాబీ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

పిఠాపురం: వాహన చోదకులు స్వీయ రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి, ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాలను స్క్రీన్‌పై ప్రదర్శించి వాహనదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రవాణశాఖ, పోలీసులు విధించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. వాహనాలకు పూర్తిస్థాయిలో రికార్డులు ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. రాంగ్ రూట్‌లో రావడం వల్ల రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆయా ప్రదేశాల్లో అతి జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై పెద్ద వాహనాలు అతి వేగంగా వస్తుంటాయని, అలాంటి పరిస్థితుల్లో జాతీయ రహదారిని దాటే టప్పుడు అన్ని వైపులా చూసుకుని వెళ్లాలన్నారు. వాహనదారులకు రోడ్డు ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

ముందస్తు సాగుకు సమాయత్తమవ్వండి

జేడీఏ విజయ్‌కుమార్

కరప: ఈనెల ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు వదిలారని, రైతులను చైతన్యపరచి సార్వాలో ముందస్తు సాగుకు సమాయత్తం చేయాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. సరైన కార్యాచరణతో సార్వా, రబీలలో ముందస్తు సాగు చేపడితే మూడో పంటగా అపరాలు సాగుచేయవచ్చని రైతులకు వివరించాలన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో గురువారం కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వీఏఏలు, ఏఈఓలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ సార్వాలో వెదజల్లు పద్ధతి అమలయ్యేలా చూడాని, ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో నాలుగైదు పంటలు వేసేలా రైతులను చైతన్యపరచాలన్నారు. తొలకరి పంట అక్టోబరు నెలాఖరు నాటికి కోతలు పూర్తయేలా చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీకల్లా నారు మళ్లు వేసేలా చూడాలన్నారు. రబీలో నవంబరు నెల 15 నుంచి డిశంబరు 15లోగా వరినాట్లు పూర్తిచేయించాలన్నారు. సాగుఖర్చు తగ్గించేందుకు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను ప్రోత్సహించాలన్నారు. ఏడీఏ కె.బాబూరావు రూపొందించిన ముందస్తు సాగుకు కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్‌ను జేడీఏ ఆవిష్కరించారు. వీఏఏలకు విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల, పురుగుల మందుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం (పెద్దాపురం) డీడీ బీవీఎస్‌సీ హరి, కాజులూరు, తాళ్లరేవు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



ముందస్తు సాగుకు కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్